ఉచిత సిలిండర్లకు నేటి నుంచి బుకింగ్

● జిల్లాలో 4.48 లక్షల మందికి ఏటా రూ.110.2 కోట్ల లబ్ధి



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా దీపావళి నుంచి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీనికి మంగళవారం నుంచి లబ్ధిదారులు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తెల్ల రేషన్‌కార్డు కలిగి, గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులుగా మారనున్నారు. నిత్యావసర సరుకుల భారం పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో ఈ ఉచిత గ్యాస్ పథకంతో కొంత వెసులుబాటు కలుగుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 4.48 లక్షల మందికి ఏటా మూడు ఉచిత సిలిండర్లు అందనున్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.839 ఉంది. దూరాన్ని బట్టి రవాణా చార్జీలు అదనంగా ఉంటాయి. ఈ రూ.839లో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.19 రాయితీగా తిరిగి ఖాతాల్లో జమ చేస్తోంది. ఇది పోను రూ.820 లబ్ధిదారులు చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది. ఒక్కో సిలిండర్‌కు రూ.820 చొప్పున ఏడాదికి మూడింటికిగాను రూ.2400 లబ్ధి కలగనుంది. ఈ లెక్కన మొత్తం 4.48 లక్షల మందికి ఏటా రూ.110.2 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాగా, గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్న వారు ముందుగా సొమ్ము చెల్లించాక వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం నగదు బదిలీ విధానం ద్వారా తిరిగి సొమ్ము జమ చేయనుంది. దీంతో ప్రస్తుతం పాత పద్ధతిలోనే సిలిండర్లు బుక్ చేసుకోవాలి.

గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇలా..

మొదటి సిలిండర్‌ను ఈ నెల 29వ తేది నుంచి బుక్ చేసుకోవాలి. రెండో సిలిండర్ వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూలై 31 లోపు, మూడవది ఆగస్టు 1 నుంచి నవంబరు 30వ తేదీ లోపు పొందాలి.

నేటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం



తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: తెల్లరేషన్‌కార్డు పేదలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం మంగళవారం నుంచి అమలుకానుందని జేసీ శుభం బన్సల్ తెలిపారు. ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు, ఆధార్‌కార్డు, బియ్యంకార్డు, ఇతర శాఖల డేటాబేస్‌లో గ్యాస్ కనెక్షన్లు, బియ్యంకార్డు, ఆధార్‌కార్డు సరిపోలి ఉండాలని సూచించారు. ఆ అర్హతలతో పాటు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధనమైవారు ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు అర్హులన్నారు. మొదట గ్యాస్ ఏజెన్సీకి సిలిండర్‌కు డబ్బులు చెల్లిస్తే 48గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో జమవుతుందన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెడదాం

సమన్వయంతో కూటమి ఆశయాలను సాకారం చేద్దాం

జిల్లా నేతలతో ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి నాయకులు, అధికార యంత్రాంగం సమన్వయంతో జిల్లాను అన్నిరంగాల్లో ప్రథమ స్థానంలో నిలబెడతామని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ఇంఛార్జి మంత్రిగా నియమితులైన ఆయన సోమవారం తొలిసారి జిల్లా ఎన్డీఏ నేతలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన తిరుపతి జిల్లాకు ఇంచార్జి మంత్రిగా నియమించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్యేలుగా కూటమి నేతలే ఉండటంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూడా అంతే సహకారంతో ముందుకు పోవాలన్నారు. నాయకుల మధ్య ఏదైనా అభిప్రాయబేధాలువస్తే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనగాని లాంటి సమర్థులైన మంత్రిని జిల్లాకు నియమించడం ఆనందంగా ఉందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. లోకేశ్ రెడ్ బుక్‌ను త్వరగా తెరవాల్సిన అవసరం ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. క్రీడాభివృద్ధికి తమ సహకారం ఉంటుందని, నియోజకవర్గాల్లోని ఆటస్థలాలను ప్రజాప్రతినిధులు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని శాప్ చైర్మన్ రవినాయుడు కోరారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అధ్యక్షత వహించిన ఈసమావేశంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని (చంద్రగిరి), పాశం సునీల్‌కుమార్ (గూడూరు), రామకృష్ణ (వెంకటగిరి), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, మోహన్, ఎస్సీవీ నాయుడు, హేమలత, మునిరామయ్య, జనసేన నేతలు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, బీజేపీ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎన్డీయే కూటమి నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ఎమ్మెల్యే ఎందుకయ్యామా..!

- బాధేస్తోందన్న బొజ్జల సుధీర్
- టీడీపీ, జనసేన నేతల వాగ్వాదంతో శ్రీకాళహస్తి సమీక్ష నేటికి వాయిదా
- గొడవలతో అర్ధంతరంగా ముగిసిన సత్యవేడు సమీక్ష
- చంద్రగిరిలోనూ టీడీపీ, జనసేన నేతల వాగ్వాదం
- తిరుపతిలో అధికారులపై కూటమి నేతల ఫిర్యాదు
- ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ సూళ్లూరుపేట బీజేపీ నేతల ఫిర్యాదు
- తిరుపతిలో ఇన్‌చార్జి మంత్రి ఎదుట జిల్లా కూటమి నేతల పంచాయితీ

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'అనవసరంగా చెడ్డపేరు వస్తోంది. ఎమ్మెల్యేగా ఎందుకయ్యామా అని బాధేస్తోంది' అంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వాపోయారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో సోమవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గాల వారీగా కూటమి నేతలతో సమావేశాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కూటమి నేతలతో మంత్రి సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. తన నియోజకవర్గంలో ఇసుక అధికంగా ఉండటంతో ఎవరు పడితే వారు తవ్వకాలకు, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. వాళ్లంతా తన పేరు చెప్పి చెడ్డపేరు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, ఇరుగుపొరుగు నియోజకవర్గాల వారూ ఇక్కడి ఇసుకపై కన్నేసి దుర్వినియోగం చేస్తున్నారని, దాన్ని తనకు ఆపాదించి వైసీపీ అనుకూల మీడియా అప్రదిష్టపాలు చేస్తోందని వేదన చెందారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఇసుక అక్రమాలను అడ్డుకోవాలే తప్ప ఇలా నిరాశగా మాట్లాడడం తగదంటూ ఆయన్ను మంత్రి సత్యప్రసాద్ అనునయించారు. గత ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేతలు బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. అప్పటి రెవెన్యూ అధికారులతో కలసి వైసీపీనేతలు పెద్ద ఎత్తున భూ రికార్డులు తారుమారు చేయడంతో ఇపుడు ప్రజల నుంచీ ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. వాటి పరిష్కారానికి ఇపుడున్న రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదన్నారు. భూ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇసుక విషయంలో పాత వైసీపీ విధానాన్నే అనుసరిస్తున్నందున చెడ్డపేరు వస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అభిప్రాయపడ్డారు. అధికారులతో పకడ్బందీగా పనిచేయిస్తే చెడ్డపేరు రాదన్నారు. తమకు ఎలాంటి ప్రాధాన్యతా లేదని, ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదంటూ జనసేన ఇంచార్జి నగరం వినుత తదితరులు ఫిర్యాదు చేశారు. వైసీపీపై పోరాడిన తమపై 17 అక్రమ కేసులున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, టీడీపీ గెలుపునకు పనిచేయలేదని, ప్రచారానికి దూరంగా ఉన్నారని టీడీపీ నేతలూ ప్రత్యారోపణ చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకోవడంతో మంత్రి సమావేశాన్ని ముగించారు. మంగళవారం ఉదయం మరోసారి సమావేశమవుదామని వాయిదా వేశారు.

వైసీపీ కార్పొరేటర్లను చేర్చుకోవద్దు

తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి నేతలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసి, దౌర్జన్యాలతో ఏకగ్రీవాలైన వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకోవద్దంటూ పలువురు నేతలు ఇన్‌చార్జి మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఒక పార్టీ చేర్చుకోకపోతే మరో పార్టీలో చేరే అవకాశాలు ఉంటాయికదా? అన్న మంత్రి ప్రశ్నకు.. కూటమి పార్టీలన్నీ ఒకే మాటపై ఉంటే వైసీపీ వాళ్లకు అవకాశం ఉండదని, రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీలో కష్టపడిన నాయకులకు కార్పొరేట్ టికెట్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీనిపై అధిష్ఠానంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి బదులిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపైనా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వీఐపీల పర్యటనల్లో తమకు సమాచారం ఉండడంలేదని, వైసీపీ నాయకులతో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెబుతుండగా..జనసేన నాయకులు ఖండించారు. తమ సమస్యలపై కమిషనరు మౌర్య స్పందించడం లేదని, ఆమెను బదిలీ చేయాలని టీడీపీ నాయకుడొకరు మంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తిరుమలలో రెవిన్యూ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి అక్రమ దుకాణాల ఏర్పాటుకు కారకుడంటూ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పలువురు మహిళా నేతలు కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, బొజ్జల సుధీర్, పులివర్తి నానీ, జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఇన్‌చార్జి కిరణ్ రాయల్, బీజేపీ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి జనసేన నేతపై ఫిర్యాదు

చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన నేత తీరుపై పలువురు టీడీపీ నాయకులు మంత్రికి ఫిర్యాదు చేశారు. తొలుత జనసేన నేత ఒకరు తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, రాజకీయంగా అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని ఆరోపించడంతో టీడీపీ నాయకులు ఎదురు దాడికి దిగారు. భూ వివాదాలు, కబ్జాల్లో తలదూర్చి కూటమి పార్టీలకు, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. వైసీపీ ముఖ్యనేతతో రాజీపడి, వైసీపీ వర్గీయులకు అనుకూలంగా సిఫారసులు చేస్తున్నారని పలు ఉదంతాలు ప్రస్తావించారు. ఓ మహిళా నేత తన వ్యక్తిగత సమస్య విషయంలో జనసేన నేత ప్రత్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. దీంతో మంత్రి సర్దిచెప్పారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ మాట్లాడుతూ ఏ స్థాయి నాయకుడు సిఫారసు చేసినా తాను వైసీపీ వ్యక్తులకు పనులు చేయనని, వైసీపీకి అనుకూలంగా పనిచేసిన వారి బదిలీలకు సిఫారసు చేయనని తేల్చి చెప్పారు.

అర్ధంతరంగా ముగిసిన 'సత్యవేడు' సమావేశం

సత్యవేడు సమీక్షకు సస్పెన్షన్‌లో ఉన్న కారణంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కాలేదు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త శ్రీపతి బాబు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా హాజరు కావడంతో గొడవ జరిగింది. తొలుత ఎమ్మెల్యే అనుకూల వర్గానికి చెందిన నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై సస్పెన్షన్ విధించడంతో అభివృద్ధి పనులు జరగడం లేదని మంత్రి ఎదుట వాపోయారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండు చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఓడిపోవాలనే ఉద్దేశంతో ఇండిపెండెంట్ అభ్యర్థికి అనుకూలంగా పనిచేసిన హేమలత తను సమావేశానికి ఎలా పిలిచారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వైసీపీ వారికి పనులు చేస్తున్నారని, కాబట్టి సస్పెన్షన్ ఎత్తివేయకూడదని వ్యతిరేక వర్గ నేతలు పట్టుబట్టారు. తమకు ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వడం లేదంటూ జనసేన నేతలు మంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సమావేశం రచ్చరచ్చగా మారడంతో వచ్చే నెల 10 లేదా 11న ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామంటూ మంత్రి సమీక్షను ముగించారు.

నకిలీ పత్రాలతో రుణం పొందిన ముగ్గురు మోసగాళ్ల అరెస్టు

● రూ.6 లక్షల నగదు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నకిలీ భూమి డాక్యుమెంట్లు తాకట్టుపెట్టి తిరుపతి ఎస్‌బీఐలో దాదాపు రూ.2.80 కోట్ల రుణం పొందిన ముగ్గురిని క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.9 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి క్రైం డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన కడియాల రామారావు, చిలకలూరిపేటకు చెందిన అన్నపురెడ్డి శ్రీనివాసరావు, విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కంచుపాటి బ్రహ్మయ్య కలిసి సులభంగా డబ్బు సంపాదించడానికి ప్రణాళిక రచించారు. రేణిగుంట మండలంలో ఫ్లోర్ క్లీనింగ్ మ్యాట్స్ తయారుచేసే లక్ష్మీనరసింహ పేరుతో పరిశ్రమ ఏర్పాటుకని తిరుపతికి వచ్చారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీకు రూ.5 కోట్ల వరకు రుణం ఇచ్చే న్యూబాలాజీకాలనీలోని ఎస్‌బీఐ బ్రాంచిని సంప్రదించారు. ఆస్తి దస్తావేజులు సమర్పించి రూ 2.80 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ తర్వాత కంతులు తిరిగి చెల్లించలేదు. దీంతో ప్రస్తుత బ్యాంకు అధికారులు, క్షేత్ర సిబ్బంది, విజిలెన్సు అధికారులు పరిశ్రమ వద్దకు వెళ్లి చూడగా రుణం తీసుకున్న పరిశ్రమ మూతపడి ఉంది. ఫ్యాక్టరీలో ఎలాంటి ఉత్పత్తులు లేకపోగా రెండేళ్ల కిందటే మూసేసి ఉండటంతో యంత్రాలన్నీ పాడైపోయాయి. దీనిపై వారు తిరుపతి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ రమణకుమార్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్లు, చిరునామాల ఆధారంగా వారి కదలికలను గుర్తించారు. సోమవారం తిరుపతిలోని టౌన్‌క్లబ్ వద్ద నిఘా ఉంచి వారిని పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రూ.ఆరు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో మరికొంతమందిని అరెస్టు చేసి నగదు రికవరీ చేయాల్సి ఉందన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ప్రకటించింది.

రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ధనలక్ష్మి

భాకరాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి అన్నారు. సమాచార హక్కు చట్టంపై చిన్నగొట్టిగల్లు రైతు సేవా కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీ తనం ఉండడానికి కార్యాలయ ఆవరణలో బోర్డు ఏర్పాటు చేయలన్నారు. ఇందులో పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారి పేర్లు, హోదా, మొబైల్ నెంబర్లు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న వివిధ కార్యక్రమాల వివరాలు ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల లోపల సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమాయానికి సమాచారం ఇవ్వకపోతే అప్పిలేట్ అధికారికి ఫిర్యాదు చేయ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

పాకాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మదుసూదన్‌రావ్ డిమాండు చేశారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ అద్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఆయాలకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు ప్రతినెల 5వ తేదిన వేతనాలు జమచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కూరగాయలు, పప్పులు, నూనెలు, సరుకులు ధరలు పెరిగిన దృష్ట్యా విద్యార్థులకు ఇస్తున్న మెనూ చార్జీలు రూ.20 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రసాద్, సుగుణమ్మ, ధనమ్మ, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

బహుజన ఆటోవర్కర్స్ యూనియన్ కార్యవర్గం

పాకాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బహుజన ఆటోవర్కర్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం స్థానిక అంబేడ్కర్ భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.నాగరాజు, అధ్యక్షుడిగా కె.రవిచంద్ర, ప్రదాన కార్యదర్శిగా డిల్లీ ప్రసాద్, కోశాధికారిగా బోయన ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ భవనం కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యవర్గ సభ్యులు వెంకటస్వామి, ప్రభాకర్, నరసింహులు, ఆదికేశవులు, ప్రభు, శ్రీనివాసులు, ఆనందయ్య, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగాని దృష్టికి చంద్రగిరి సమస్యలు : నాని


మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే పులివర్తినాని సోమవారం మర్యాపూర్వకంగా కలిశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి చేరుకున్న మంత్రిని గ్రాండ్‌రిడ్జ్ హోటల్‌లో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో తమ నియోజకవర్గం వెనుకబడిపోయిందన్నారు. సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని మంత్రికి తీసుకువచ్చారు. జగనన్న కాలనీల పేరుతో అప్పటి ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు పలు మోసాలకు పాల్పడ్డారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

రీసర్వేలో సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం


మాట్లాడుతున్న మోహన్ తదితరులు

తిరుపతిరూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): రీసర్వే భూములకు సంబంధించిన సమస్యలను 15రోజుల్లో పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తిరుపతి రూరల్ మండల ఆర్ఎస్‌డీటీ ఎం.మోహన్ తెలిపారు. మండలంలోని పాతకాల్వపంచాయతీలో రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే సమస్యలపై రెవెన్యూ అధికారులకు అర్జీ అందిన రెండు వారాల్లో పరిష్కరిస్తామన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రీసర్వేపై 2, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 3 ఫిర్యాదులు అందాయన్నారు. మండలసర్వేయర్ హేమకుమార్, వీఆర్వో పుల్లూరు రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంగళం-శెట్టిపల్లె మార్గం పనులు పునఃప్రారంభం


మట్టిని చదును చేస్తున్న డోజర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మంగళం-శెట్టిపల్లె మార్గం పనులు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. విజిలెన్స్ విచారణలో భాగంగా టీటీడీ ఇంజనీరింగ్‌కు సంబంధించిన అన్ని పనులు అర్ధంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. తెలుగుగంగ పైపులు అడ్డురావడం కూడా అదనపు కారణంగా తెలుస్తోంది. మూడు నెలలుగా వాహనచోదకులకు ఇబ్బందులు పడుతున్నారు. రెండు వారాల క్రితమే అనుమతులు ఇచ్చినా వాతావరణం అనుకూలించకపోవడంతో పనులు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు సోమవారం మొదలుపెట్టారు. తెలుగుగంగ పైపులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 80 అడుగుల వెడల్పుతో నాలుగు వరుసల రహదారి ఆవిష్కృతం కానుంది.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మికుల నిరసన



తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి,ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి .రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌టీపీ బస్టాండు ఎదుట అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆటో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమాన్ని హరించే విధంగా అమలు చేసిన జీవోలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నేటి వరకు ఎందు అమలు చేయలేదని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శివ, కెవై రాజా, సురేష్, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన ముంబై హైకోర్టు జడ్జి



చంద్రగిరి, అక్టోబరు 28: చంద్రగిరి కోటను ముంబై హైకోర్టు జడ్జీ మంగేష్ పటేల్ కుటుంబ సభ్యులతో సోమవారం సాయంత్రం సందర్శించారు. కోటలో పురాతన విగ్రహాలు, అప్పటి యుద్ధ సామగ్రి, అప్పటి కట్టడాలు అద్బుతంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. చంద్రగిరి కోటను సందర్శించడం ఇదే మొదటి సారి అని చెప్పారు. చంద్రగిరిలో అప్పటి రాజుల పరిపాలన, చరిత్ర గురించి తెలుసుకున్నామన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ దేకా

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఛత్తీస్‌గఢ్ గవర్నర్ రామెన్ దేకా, సినీ దర్శకుడు వశిష్ఠ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఉన్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

స్కూటరిస్టుకు తీవ్రగాయాలు


క్షతగాత్రుడు గణేష్

రామచంద్రాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి - పచ్చికాపల్లం ప్రధానరహదారిలో ఆర్‌సీపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. వెదరుకుప్పం మండలంపచ్చికాపల్లంకు చెందిన గణేష్(35) తిరుపతిలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఆర్‌సీపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గణేష్ కాలు విరిగింది. స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల నిలుపుదల


ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలకు తవ్విన గుంతలు

తిరుపతి రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె సర్వే నంబరు 121/5లోని ప్రభుత్వ భూమిలో(బండి బాట) ఆక్రమణలను సోమవారం స్థానిక గ్రామ రెవెన్యూ అధికారులు అడ్డుకుని నిలుపుదల చేశారు. ఈ విషయమై ఈనెల 13న ఆంధ్రజ్యోతిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన తహసీల్దార్ రామాంజులునాయక్ ఆదేశాల మేరకు ఇటీవల స్థానిక రెవెన్యూ అధికారులు స్థల సందర్శన చేసి, ఈ భూమిలో కొందరు ఆక్రమణదారులు హద్దులుగా నాటిన పెన్సింగ్ రాళ్లను పడగొట్టారు. ఇందులో 1.29 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో బండిబాటగా నమోదై ఉందని, ఈ స్థలంలో ఎవరూ అక్రమంగా ప్రవేశించరాదని హెచ్చరించారు. అయినా ఇప్పుడు ఇదేస్థలంలో సోమవారం ఎక్సవేటర్ సాయంతో గుంతలు తీయడంతోపాటు నిర్మాణ సామగ్రిని తోలి ఉన్నారనే సమాచారంతో గ్రామ వీఆర్వో, సర్వేయర్ వెళ్లి పనులను నిలుపుదల చేశారు. ఈ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పులిచెర్ల టు పాకాల

పుల్లావాండ్లపల్లి సమీప అడవిలో ఏనుగుల తిష్ట


ధ్వంసమైన వరి పంటను పరిశీలిస్తున్న ఎఫ్‌బీఓ శ్రీదేవి

కల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట, చల్లావారిపల్లి పంచాయతీల్లో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు విధ్వంసం కొనసాగింది. దీంతో మామిడి, వరి, టమోటా తదితర పంటలకు నష్టం వాటిల్లింది. ముందుగా 16 ఏనుగుల గుంపు పాతపేట సమీపం చేరుకుని ముస్తాక్‌అహ్మద్‌కు చెందిన మామిడిచెట్లు, రాతి కూసాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. అటవీశాఖ సిబ్బంది టపాకాయలు పేల్చడంతో వారిపై ఏనుగులు తిరగబడ్డాయి. సమీపంలోని చల్లావారిపల్లి వద్దకు చేరుకొని శేషాద్రి నాయుడుకు చెందిన అర ఎకరా టమోటా పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. చెంగ్రాయ నాయుడుకు చెందిన అరఎకరా టమోటా, సుధాకర్‌కు చెందిన ఎకరా వరిపంట, యర్రయ్యకు చెందిన అర ఎకరా వరిపంట, సావిత్రమ్మకు చెందిన అర ఎకరా వరి, లక్ష్మీదేవికి చెందిన అర ఎకరా వరి, గురుమూర్తి నాయుడుకు చెందిన పైపులను ధ్వంసం చేశాయి. అనంతరం పాతపాళ్యం అడవిలోకి చేరుకున్నాయి. సోమవారం పాకాల మండలం పుల్లావాండ్లపల్లి సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్టవేశాయి. ఏనుగుల కదలికను డ్రోన్ కెమరాలు, బైనాక్యులర్ల సాయంతో రేంజర్ థామస్ సుకుమార్, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్ఓ షఫి, ఎఫ్‌బీఓలు మున్నా, శ్రీదేవి గమనిస్తున్నారు. రాత్రికి పులిచెర్ల మండలంలోకి వచ్చే అవకాశాలున్నాయని,మండలంలోకి రాకుండా కట్టడి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

గ్రామీణ పేదల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, వారికి భూ పంపిణీ చేయాలని గ్రామీణ పేదల సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి పరిసర ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల ఫారెస్ట్, బంజరు, సీలింగ్, దేవుడి మాన్యాలు, మఠం భూములు భూస్వాములు, పెత్తందారుల చేతుల్లో ఉన్నాయన్నారు. వాటిని గుర్తించి, నిరుపేదలకు పంచాలన్నారు. 2005లో రేణిగుంట విమానాశ్రయ విస్తరణ, ప్రభుత్వ రంగ సంస్థలు, బాలాజీ రిజర్వాయర్ కోసం తీసుకున్న పేదల భూములకు అరకొర నష్టపరిహారం ఇచ్చారే తప్పా వారికి ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వలేదన్నారు. పాకాల మండలంలో అడవి పందుల నుంచి పంటల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి భాస్కర్, సభ్యులు చంద్ర, గోపి, ఉమామహేష్, జీవరత్నం, చరణ్, హరి, చెంచిరెడ్డి, ప్రభాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కనకదాసు జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని తిరుపతి జిల్లా కురబ సంఘ అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి పరమ భక్తుడు, కురబల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసు జయంతిని గతంలో ప్రభుత్వ ఆద్వర్యంలో నిర్వహించేవారని, ఎన్డీయే ప్రభుత్వమూ అదే తరహాలో చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతిలో కనకదాసు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, భవన నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. . గుండ్లూరు శ్రీనివాసులు, రుయా మల్లి, నాగసుబ్బయ్య, రెడ్డిశేఖర్, రాచపల్లి రమేష్, టి.రవీంద్ర, ఆదినారాయణలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు మందుబాబులు దాడి చేసి గాయపరిచారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు...తిరుపతి డిపోకు చెందిన బస్సు తిరుమలకు వెళుతోంది. ఈ క్రమంలో ఉదయ్ హోటల్ వద్ద వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న సుబ్బు, రాజులు బస్సు సైడ్ ఇవ్వలేదని ఆక్రోశంతో ఆపారు. డ్రైవర్ షఫీ భాషాను విచక్షణా రహితంగా కొట్టి గాయపరచారు. సోమవారం బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారిద్దరూ మద్యం తాగి ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

తిరుపతి విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో జీఎస్ మాడ వీధిలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల ఏజీఎం సురేష్ తెలిపారు. లెవల్-1లో ఉత్తీర్ణులై లెవల్-2కి ఏకంగా 70 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. మాట్‌కు 19 మంది, పాట్‌కు 20, చాట్‌కు 31 మంది ఎంపికయ్యారని వివరించారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ జయప్రకాష్, డీన్ సురేష్, ఇన్‌చార్జి నరేంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

గజమాలతో సత్కారం

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజినీకాంత్, గాలి పవన్, వెంకటేష్, జలపోతు చంద్రలు గజమాలతో సత్కరించారు. అదేవిధంగా నాయకులు పాతకం వెంకటేష్, కొట్టే హేమంత్ రాయల్, వివేక్ తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికినవారిలో ఉన్నారు

శ్రీవారిసేవలో జస్టిస్ వెంకటరమణ



తిరరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

షర్మిల తాత, తండ్రి దయతోనే ఎదిగావు

● ఆమెపై అనుచిత వ్యాఖ్యలు తగవంటూ భూమనపై కాంగ్రెస్ నేతల విమర్శ

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'షర్మిలారెడ్డి తాత రాజా రెడ్డి, తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీర్వాదంతోనే భూమన కరుణాకర్‌రెడ్డి ఈ స్థాయికి ఎదిగారు. రెండోసారి టీటీడీ ఛైర్మన్ పదవి వచ్చినప్పుడు లోటస్‌పాండ్‌కు వెళ్లి విజయమ్మ ఆశీర్వాదం తీసుకొచ్చారు. ఇప్పుడు షర్మిలమ్మ టీడీపీతో కలిసిందని ప్రచారం చేస్తూ ఆ కుటుంబంపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నావు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి' అని కాంగ్రెస్ నేతలు డిమాండు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు గౌడ పేరు చిట్టిబాబు మాట్లాడుతూ.. షర్మిలారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారేగానీ.. సొంత తల్లిపై కేసు పెట్టిన జగన్ గురించి ప్రస్తావన చేయకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మహిళలను విమర్శిస్తే రాష్ట్రంకానీ, దేశంకానీ క్షమించదన్నారు. ఈ సమావేశంలో మురళీకృష్ణ, శివశంకర్, లోకేష్‌రెడ్డి, ఖలిందర్, శివబాలాజీ, నాయక్, నరేంద్రబాబు, గోపి పాల్గొన్నారు.

తిరుగుతూనే ఉన్నాం.. సమస్యలకు పరిష్కారమేదీ?

● అర్జీదారుల ఆవేదన
● పీజీఆర్ఎస్‌కు 211 ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్) అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 'తిరుగుతూనే ఉన్నాం... మా సమస్యలు పరిష్కారం కావడం లేదు' అని అధికారుల వద్ద అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారులు వచ్చి సమస్యలను ఏకరవుపెట్టారు. నిర్దేశిత సమయంలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను జేసీ శుభం బన్సల్ ఆదేశించారు. డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టరు దేవేంద్రరెడ్డి అర్జీలు స్వీకరించారు. మొత్తం 211 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 143 ఉన్నాయి.

●దురాక్రమణలు తొలగించి స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతాన్ని పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు కోరారు. చంద్రగిరి నుంచి రేణిగుంట మండలాల వరకు నది తీరప్రాంతం కబ్జాకు గురైందని తెలిపారు. తిరుచానూరు, వేదాంతపురం, కొత్రమంగళం, గురురువాడ, తొండవాడ పంచాయతీల్లోని తీరప్రాంతాల్లో కబ్జా చేస్తున్నారన్నారు. తిరుచానూరు లెక్క దాఖలా 479 సర్వే నంబరులో 400 ఎకరాలు దురాక్రమణకు గురైందన్నారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులకు విన్నవించారు.

●గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు భూపంపిణీ చేయాలని గ్రామీణ పేదల సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు కోరారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో లక్షలాది ఎకరాల ఫారెస్ట్, బంజరు, సీలింగ్, దేవుడి మాన్యాలు, మఠం భూములు భూస్వాములు, పెత్తందారుల చేతుల్లో ఉన్నాయన్నారు. వాటిని గుర్తించి, నిరుపేదలకు పంచాలన్నారు. విమానాశ్రయ విస్తరణ, ప్రభుత్వ రంగ సంస్థలు, బాలాజీ రిజర్వాయర్ కోసం తీసుకున్న పేదల భూములకు అరకొర నష్టపరిహారం ఇచ్చారే తప్ప వారికి ప్రత్యామ్నాయంగా భూములు ఇవ్వలేదన్నారు.

●ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. అర్జీదారులు సమస్య పరిష్కారం కోసం 5, 6 వారాలకు తక్కువ కాకుండా కలెక్టరేట్‌లో అర్జీలు ఇస్తున్నారన్నారు. కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్య ధోరణితో పరిష్కారం కావడం లేదన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని అర్జీలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

●సాయినగర్, లింగేశ్వర్‌నగర్ పంచాయతీల పరిధిలో రూ.వందల కోట్లు విలువైన మఠం భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వాటిని కాపాడాలని సర్పంచులు డీవీ రమణ, కోటేశ్వరరావు కోరారు. మఠం భూముల్లో కొన్ని క్రయవిక్రయాలు జరిగాయని, ఈ విషయంలో నిత్యం ఘర్షణలు జరుగుతుండటంతో తమ గ్రామాల్లో శాంతి భద్రలకు విఘాతం కలుగుతోందన్నారు. తప్పుడు పత్రాలతో సదరు భూముల్లో ప్రవేశించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సాయినగర్ పంచాయతీ సర్వే నెంబరు 147/1లోని జయనగర్ ప్రాంతాన్ని మఠం అధికారులు 40 ఏళ్ల క్రితం విక్రయించారని, దాన్ని సబ్ డివిజన్ చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతివ్వాలని కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 70 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన వినతులను శాంతి భద్రతల అదనపు ఎస్పీ రవిమనోహరాచారి అందుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.




జిల్లా పర్యటనకు తొలిసారిగా ఇన్‌ఛార్జ్ మంత్రి హోదాలో సోమవారం వచ్చిన అనగాని ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి - జనసేనపార్టీ తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్- టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు -తిరుపతి అర్బన్(ఆంధ్రజ్యోతి)

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

తిరుమల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ వేడుకలను తిరుమల బ్రహ్మోత్సవాల తరహాలో నిర్వహించాలన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం ఆయన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. నవంబరు 28 నుంచి డిసెంబరు 4 వరకు బ్రహ్మోత్సవాలు జరుగతాయన్నారు. చలువ పందిళ్లు, రంగోళీలు, క్యూలైన్లు, బారీకేడ్లు తదితర పనులు త్వరతిగతిన పూర్తిచేయాలన్నారు. ఆలయం, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అలంకరణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పీఏ సిస్టమ్, ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేయాలన్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆద్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిణి, శిల్పారామం, తిరుచానూరు ఆస్థాన మండపంలో ధార్మిక, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

శుక్రవారపు తోటలో పుష్పప్రదర్శనశాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. పంచమితీర్థం నాడు నిరంతరాయంగా అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆ రోజు భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. సమీక్షలో జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీఈవో గోవిందరాజన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు ప్రశాంతం




కేటీ రోడ్డులోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల సందడి, తిరుమలలో పోలింగ్ కేంద్రం

- కౌంటింగ్ ప్రారంభం
- ఫలితాలు నేడు

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తిరుమల, తిరుపతిలో ఏర్పాటు చేసిన 24 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరిగింది. 11 గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ తర్వాత ఊపందుకుంది. 11 గంటల వరకు 50శాతం లోపే ఓటింగ్ జరిగింది. చివరి మూడు గంటల్లో ఉద్యోగులు భారీ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 6,349 ఓట్లకు గాను 5,549 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి ఉమాపతి తెలిపారు.

ప్రారంభమైన కౌంటింగ్ : పోలింగ్ ముగిసిన తర్వాత సాయంత్రం 4.30 నుంచి 5గంటల మధ్య గోవిందరాజస్వామి హైస్కూలులో కౌంటింగ్ ప్రారంభమైంది. 24 పోలింగ్ బాక్సులు లెక్కించడానికి 8 టేబుల్స్ ఏర్పాటు చేశారు. మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు. మంగళవారం ఉదయం ఫలితాలు ప్రకటిస్తామని ఉమాపతి తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న జేసీ శుభం భన్సల్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ తెలిపారు. జంప్‌రోప్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన తిరుపతి గ్రామీణ మండలం మంగళంలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ క్రీడాకారులు సోమవారం ఉదయం జేసీని మర్యాదపూర్వకంగా కలిశారు. జేసీ వారిని అభినందించి, క్రీడల్లో మరెన్నో విజయాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్కూల్ కరెస్పాండెంట్ ప్రియా, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీలను అభినందించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, ఎన్సీసీ దేవేంద్రరెడ్డి, పీడీ డీఆర్డీఏ శోభన్‌బాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ఆరోగ్యం మెరుగు



రక్తదానం చేస్తున్న డీఎస్పీ బాలిరెడ్డి

మంగళం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం చేరి ఆరోగ్యవంతంగా ఉంటారని, పైగా ఆపదలో ఉన్న వారికి అది ఎంతో ఉపయోగపడుతుందని టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో రుయా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి హరిత సిబ్బందితో కలిసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 29 మంది టాస్క్‌ఫోర్సు ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు పండ్లు పంపిణీ చేశారు. డీఎస్పీ బాలిరెడ్డి, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు స్విమ్స్ విశేష కృషి



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టరు ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శ్రీపద్మావతి ఆడిటోరియంలో సోమవారం సింహాద్రి సత్యనారాయణరావు 3వ ఎండోమెంట్ చైర్ ఓరేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డైరెక్టరు ఆర్వీకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ పెనుభూతంగా మారుతున్న క్రమంలో దాన్ని నిర్మూలించేందుకు వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. ప్రధానంగా స్విమ్స్ క్యాన్సర్ నిర్మూలనకు ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు క్యాన్సర్ కారకాలు.. నివారణ పద్ధతుల గురించి వివరించారు. వైద్య విభాగాధిపతి నరేంద్ర, వైద్య నిపుణులు ముక్తా శ్రీనివాసులు, అపర్ణ బిట్లా, వనజాక్షమ్మ, రామ్, మణిలాల్ పాల్గొన్నారు.

ఆఫీసర్స్ సోషియల్ అండ్ కల్చరల్ క్లబ్ నూతన కార్యవర్గం

తిరుపతి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆఫీసర్స్ సోషియల్ అండ్ కల్చరల్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం ఆఫీసర్స్ క్లబ్‌లో రిటర్నింగ్ అధికారి విశ్రాంత ప్రొఫెసర్ జి.రామచంద్రయ్య పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ఫలితాలను సోమవారం విడుదల చేశారు. అధ్యక్షుడిగా కె.మోహనమునిసిద్ధారెడ్డి, కార్యదర్శిగా డాక్టర్.ఎస్.ఆదికృష్ణయ్య కోశాధికారిగా ఎస్వీఎస్ ప్రసాదరెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.భాస్కరుడు, వి.రవి, సంయుక్త కార్యదర్శిగా బొందు రామచంద్రారెడ్డి(సాంస్కృతికం), జీవీ మునికృష్ణ(క్రీడలు), ఇంటర్నల్ ఆడిటర్‌గా వి.కరంచంద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్.బాబురావు, ఆర్.వి.దుర్గాప్రసాద్, జె.లక్ష్మీనారాయణ, వి.రమేష్‌బాబు, కె.ఆర్.సుభాష్, సి.ఎస్.సుకుమార్‌రెడ్డి నియమితులయ్యారు.

జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జాతీయ సదస్సు బ్రోచర్‌ను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి, వర్సిటీ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద ఆవిష్కరించారు. డిసెంబరు 7, 8 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రంథాలయాల సాధికారతకు సాంకేతిక విద్య మాధ్యమాల పాత్ర అంశంపై చేపట్టే సదస్సులో పలు ప్రాంతాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, లైబ్రేరియన్స్ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని తెలిపారు.

విశ్రాంత లైబ్రేరియన్‌కు సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి వి.షణ్ముగానికి ఘనసన్మానం చేశారు. యూనివర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ సన్మానం నిర్వహించారు. వర్సిటీ సెనేట్ హాల్లో చేపట్టిన స్వర్ణోత్సవాల్లో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి, వర్సిటీ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. సుదీర్ఘకాలంగా యూనివర్సిటీ గ్రంథాలయానికి షణ్ముగం గొప్ప సేవ చేశారని కొనియాడారు.

మహిళలకు ఆరోగ్యం చాలా అవసరం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యం నేటి సమాజానికి చాలా అవసరమని, ఇందుకోసం మహిళా సంఘాలు ఆరోగ్య భద్రతపై దృష్టి పెట్టాలని జిల్లా వైద్యాధికారి శ్రీహరి అన్నారు. మహతి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన శ్రీపద్మావతి మహిళా అభ్యుదయ సంఘం 32వ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్థికాభివృద్ధి సాధించిన మహిళా సంఘాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టాటా క్యాన్సర్ వైద్యశాల వైద్యాధికారి ప్రశాంత్, మేనేజింగ్ డైరెక్టరు మురుగేష్, సీఈవో ధర్మేంద్రకుమార్, ప్రోగ్రాం ఫీల్డ్ ఆఫీసర్ మోహన్, కో-ఆపరేటివ్ సీఈవో ధర్మేంద్ర కుమార్, ప్రోగ్రాం ఫీల్డ్ ఆఫీసర్ మోహన్, శంకరి, శారద, సరోజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ లా కళాశాల విద్యార్థులకు ప్రథమస్థానం



మొదటి బహుమతి అందుకుంటున్న విద్యార్థుల బృందం, పక్కనే డాక్టర్ తిప్పారెడ్డి

తిరుపతిరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలిలో ఈనెల 26, 27తేదీల్లో క్లాసిక్ కాలేజ్ ఆఫ్ లా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రమేష్‌కుమార్ మెహ్రోత్ర రష్మి మెమో రియల్ ఇంటర్నేషనల్ మూట్ కోర్ట్ పోటీలలో తిరుపతికి చెందిన అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల బృందం అత్యుత్తమ ప్రతిభ చాటి ప్రథమస్థానం కైవసం చేసు కుందని ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి పేర్కొ న్నారు. కళాశాల ప్రొఫెసర్ రేష్మి నేతృత్వంలో జ్ఞాని, కౌశిక్, యశ్వంత్‌లతో కూడిన విద్యార్థుల బృందం 30 అంతర్జాతీయ, జాతీయ జట్లతో పోటీపడి సుదీర్ఘ పరిశోధన, చురుకైన న్యాయవాదనతో మూట్‌కోర్ట్‌లో సెమీఫైనల్‌కి చేరుకోగా.. బెస్ట్ మెమోరియల్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతి సాధించిందని తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ అదూరి శారద అభినందించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



తిరుపతి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో సింగాలగుంట రాములవారి గుడి వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం జరిగింది. పెద్దఎత్తున సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 100 చెల్లించి సభ్యత నమోదు చేసుకుంటే రూ.5 లక్షల వరకూ బీమా వర్తిస్తుందన్నారు. శాశ్వత సభ్యత్వాన్ని లక్ష రూపాయలుగా నిర్ణయించారన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రతి ఒక్కరు ఉన్నచోట నుంచి ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేసుకోవచ్చన్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న రాష్ట్ర నాయకులు నాయకులు మందలపు మోహన్ రావు, మన్నెం శ్రీనివాసులు, దంపూర్ భాస్కర్ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీహరి నాయుడులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పనబాక లక్ష్మి, నరసింహ యాదవ్, శ్రీధర్ వర్మ, పుష్పావతి, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, ఆముదాల తులసీరాం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 40 వినతులు

తిరుపతి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 40 వినతులను వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. వినతులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మార్‌పల్లి, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ఆరని సంధ్య కోరారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, కారుణ్య నియామకాలో ఉద్యోగం ఇప్పించాలని, బీఎల్వో తనకు ఎపిక్ కార్డు ఇవ్వకపోవడంతో పీఎఫ్ మంజూరుకు అంతరాయం కలుగుతోందంటూ పలువురు తమ సమస్యలను నివేదించారు. అర్జీలను కమిషనర్ ఆయా విభాగాలకు కేటాయించారు. సమావేశంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, ఎంహెచ్‌వో యువ అన్వేష్, రెవెన్యూ ఆర్వోలు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉన్నారు.

సైబర్ నేరాలపై నేడు సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలల విషయంలో ఇటీవల జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, వేధింపులు, సైబర్ నేరాలపై భీమాస్ హోటల్లో మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. కొంతమంది బాలలు చెడు అలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, నివారణలో భాగంగా చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా: కమిషనర్

తిరుపతి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మురుగునీటి కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ పన్నులను వెంటనే వసూలు చేయాలన్నారు. మురుగునీటి కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నట్లు ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇలాంటి వారిని గుర్తించి జరిమానా విధించాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్తను పక్కాగా సేకరించాన్నారు. నగరంలో ఎక్కడైనా చెత్త కనిపిస్తే ఆయా ప్రాంతాల్లోని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భూమిని కాపాడి న్యాయం చేయండి

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తన భూమిని కాపాడి న్యాయం చేయాలని జీవనందన్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ స్వానుభవంలో ఉన్న భూమిలో 0.21 సెంట్లను నకిలీ పత్రాలతో రిటైర్డ్ డీఎస్పీ భాస్కరనాయుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని, హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కోను కూడా ఖాతరు చేయకుండా షెడ్డు నిర్మించాలని ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా తమపైనే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమ గ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు సంజయ్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు.

బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ అనుమానాస్పద మృతి



ఉరేసుకున్న వెంకటప్రసాద్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన తిరుపతి రూరల్ పరిధిలోని తనపల్లి క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు సోమవారం రాత్రి 10.30 గంటలకు విడుదల చేసిన వివరాల మేరకు శ్రీపురం కాలనీకి చెందిన వెంకటప్రసాద్(32) ప్రైవేటు బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. భార్య మాధురి టీటీడీ సీసీ టీవీ వింగ్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. వీరికి పిల్లలు లేరు. వివిధ అవసరాల నిమిత్తం వెంకటప్రసాద్ రూ.40 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తిరిగి కట్టలేక, వడ్డీలు చెల్లించలేక ఇబ్బంది పడేవాడు. మరో వైపు పిల్లలు లేరనే మానసిక వేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో స్కూటీలో తనపల్లి క్రాస్ వద్ద ఉన్న లాడ్జికి వచ్చి రూము అద్దెకు తీసుకున్నాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో భార్య మాధురి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. ఆమె ఈ విషయాన్ని మరిది భాస్కర్‌కు చెప్పింది. స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్కూటీ ఆధారంగా పోలీసులు లాడ్జికి చేరుకుని పరిశీలించగా గదిలో ఉరేసుకుని కనిపించాడు. అయితే బెడ్‌పై రక్తపు మరకలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరు ఆదేశించినా అదే తీరు



ఆక్రమిత దుకాణంలో దర్జాగా వ్యాపారం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారుల చెర నుంచి దుకాణాన్ని స్వాధీనం చేసుకోవాలని కలెక్టరు ఆదేశించినా రుయా అధికారులు నాన్చుతున్నారు. రుయాస్పత్రిలో హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి అనుచరులు గత నెల 28న ఆస్పత్రి ఆవరణలో ఖాళీ దుకాణాన్ని ఆక్రమించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో తక్షణమే దుకాణం ఖాళీ చేయాలని రుయా అధికారులు ఆక్రమణదారులను హెచ్చరించారు. అయితే సదరు హెచ్‌డీఎస్ సభ్యుడు కలుగజేసుకుని 'మన వాళ్లే వదిలేయండి లేకపోతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుందని' అధికారులకు చెప్పినట్లు సమాచారం. దీంతో అధికారులు ఆ దుకాణం జోలికి పోలేదు. ఈ నెల 18 జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో దుకాణం విషయం కలెక్టరు దృష్టికి వచ్చింది. స్వాధీనం చేసుకొని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పది రోజులు అవుతున్నా అధికారులు నేటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఆక్రమణదారులు అద్దె, కరెంటు బిల్లు లేకుండా దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు.







పచ్చని పొలంలో తెల్ల కొంగలు

వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ పొలాల్లో కొంగల సందడి ఎక్కువైంది. దమ్ము చేసిన పొలాల్లో, ఏపుగా పెరిగిన పచ్చని పైరుల మధ్య, పిల్ల గాలులకు కొంగలు అటు ఇటు ఎగురుతూ కనువిందు చేస్తున్నాయి. పంటలకు కీడు తలపెట్టే పురుగులను ఏరి తింటూ రైతులకు మిత్రుల్లా సాయం చేస్తున్నాయి. నాగలాపురం మండలం గోపాలపురం వద్ద పొలాల్లో గుంపులుగా వాలిన కొంగలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

ఏంటి సిస్టర్ ఇది?

స్విమ్స్‌లోని ఓపీ విభాగం సోమవారం రోగులతో కిక్కిరిసిపోయివుంది. న్యూరాలజీ ఓపీ విభాగంలో వందమందికి పైగా రోగులు వైద్యుల అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడ బీపీ, పల్స్ చూడాల్సిన స్టాఫ్‌నర్సు ఇలా ఫోను చూస్తూ ఉన్నారు. మధ్యమధ్యలో కాసేపు బీపీ చెక్ చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రగిరి, అక్టోబరు 28: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రాశనాయనం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. పవిత్రోత్సవాల కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు కల్యాణోత్సవం, మంగళవారం స్వర్ణపుష్పార్చన, బుధవారం అష్టోత్తర శతకళశాభిషేకం, ఆర్జితం సేవలను టీటీడీ రద్దు చేసింది. గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. పవిత్రం, ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, అనంబట్టు ధనశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



శ్రమజీవన సౌందర్యం

శ్రమజీవన సౌందర్యం

పద్మనాభం కుటుంబం

పుత్తూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెల్లవారకముందే ఆ అమ్మాయి పశువుల కొట్టంలోకి వెళ్తుంది. పేడ జవిరి కుప్ప పోస్తుంది. చీపురు అందుకుని ఊడవడం మొదలుపెడుతుంది. ఆ వెంటనే తమ్ముడు రంగంలోకి దిగుతాడు. పశువులన్నింటినీ కడిగి శుభ్రం చేస్తాడు. చిన్నతమ్ముడు పాల క్యాన్‌లతో అక్కా అన్నలకి సాయంగా వస్తాడు. దానా వేసి, కగుడు నీళ్లు తాగించి, పాలు పితికి క్యాన్‌లు నింపుతారు. అక్క ప్రియదర్శిని ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్. సివిల్స్‌కి కోచింగ్ తీసుకుంటోంది. పెద్ద తమ్ముడు ఉమేష్ ఇంజనీరింగ్ ఫైనలియర్. చిన్నవాడు శశికిరణ్ నీట్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఇన్‌స్టాలో రీల్స్ కోసం చేసిన ఫోటో షూట్ కాదు ఇది.. వారి దినచర్య. వ్యవసాయ కుటుంబాల్లో శ్రమకు ఉండే గౌరవానికి ప్రతీకగా కనిపిస్తుంది ఆ కుటుంబం. పుత్తూరులో నారాయణవనం రోడ్డులో వీరి నివాసం. నాన్న పద్మనాభానిది నారాయణవనం మండలం ఎరికంబట్టు. 60 సెంట్ల భూమి.. గంపెడు కుటుంబం.. రెక్కలు ముక్కలు చేసుకునేవారు. రెండు బర్రెలు పట్టుకుని భార్య ఆసరాగా నిలచింది. ఇంతలో అతనికి పోలీసు ఉద్యోగం వచ్చింది. పిల్లలు బాగా చవుకుని వృద్ధిలోకి రావాలనే కల నెరవేర్చుకోవడానికి పోలీసు జీతం ఎంత? రెక్కల కష్టాన్ని తమ పిల్లలకు కూడా వారసత్వంగా ఆ తండ్రీ, తల్లీ అందించారు. వారి మనసెరిగిన ఆ బిడ్డలూ తమ గుడ్డలు నలుగుతాయని వెరవలేదు. ఇంజనీరింగ్ చదువుతూ పేడ పనేమిటని సిగ్గు పడలేదు. స్నేహితుల ముందు అవమానం అని ఎన్నడూ అనుకోలేదు. చదువుకుంటూనే అన్ని పనులూ చేస్తున్నారు. ఇప్పుడు వారి దగ్గర 14 ఆవులు, నాలుగు బర్రెలు ఉన్నాయి. కాలేజీకి వెళ్లే ముందూ, వచ్చిన తర్వాత కూడా ఆ ముగ్గురు పిల్లలూ ఒళ్లు అలిసేలా శ్రమిస్తారు. కష్టం చేస్తూ కళకళలాడుతూ తిరిగే వీరిని చూసి 'దేవుడు దీవించి మావాడికి మంచి బిడ్డల్ని ఇచ్చాడు' అని పద్మనాభం తల్లిదండ్రులు ఆనందంగా చెప్పుకుంటారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

వడమాలపేట, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం బంగారెడ్డి ఎస్టీ కాలనీకు సమీపంలో ప్రభుత్వ గుట్ట పోరంబోకు ఆక్రమణను తొలగించారు. 'ప్రభుత్వ భూమికి కంచె' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరు చొరబడినా శిక్షార్హులేనని, క్షమించేది లేదని తహసీల్దారు జరీనా హెచ్చరించారు.

స్వర్ణముఖిని పరిశీలించిన అధికారులు

రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని తహసీల్దారు శ్యాంప్రసాద్ హెచ్చరించారు. 'వాళ్లు, వీళ్లు కలిసి ఇసుకను దోచేస్తున్నారు' అంటూ ఇసుక అక్రమ రవాణాపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన థకనంపై ఆయన స్పందించారు. గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, వీఆర్వో, వీఆర్‌ఏ, కానిస్టేబుల్‌తో కలిసి కొత్రమంగళం స్వర్ణముఖి నది తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ప్రాంతాలను, రోడ్లను పరిశీలించారు. ఇక్కడి తవ్వకాలపై ఉన్నత అధికారులకు నివేదిక అందించినట్లు తహసీల్దారు తెలిపారు. ప్రతిరోజు వీఆర్వో, వీఆర్‌ఏ, పోలీసు బ్లూకోల్ట్స్ వేర్వేరుగా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గస్తీ చేపడతారన్నారు.



ఇసుక తవ్విన ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దారు, సీఐ తదితరులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా టపాసుల తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం హెచ్చరించారు. నిషేధిత రసాయనాలతో తయారైన టపాసులు విక్రయిస్తే కేసులు పెట్టి, అరెస్టు చేస్తామన్నారు. బాణసంచా వంటి పేలుడు పదార్థాలు ఇళ్లలో నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. టపాసుల దుకాణాల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని ఉంచుకోవాలన్నారు. జిల్లాలో టపాసుల అక్రమ విక్రయాలు, నిల్వలు, రవాణాపై డయల్ 112కు లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మందుగుండు సామగ్రి, తయారు చేసే ప్రాంతాలు, స్టోరేజి చేసిన గోడౌన్లు, అమ్మకాలు చేసే ప్రదేశాలపై ఇప్పటికే నిఘా ఉంచామన్నారు.

బాంబు బెదిరింపులపై దర్యాప్తు వేగవంతం

తిరుపతిలోని హోటళ్లు, రెండు ఆలయాలకు వరుస బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంపై ప్రత్యేక సైబర్ టీం, ఐటీ, ఇతర విభాగాలతో దర్యాప్తు వేగవంతం చేశామని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ప్రజలు, యాత్రికులు భయాందోళనకు గురికావాల్సిన పనిలేదన్నారు. తిరుపతి, తిరుమలలో భద్రత పెంచామన్నారు. నిరంతరం సీసీ టీవీ పర్యవేక్షణలో ప్రతి ఒక్కరి కదలికలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విదేశీయులను టార్గెట్‌గా చేసుకుని ఈ మెయిల్స్ వచ్చాయా అనే దానిపైనా విచారణ వేగవంతం చేశామన్నారు.

కాణిపాకం ఆలయ ప్రధాన అర్చకుడి సస్పెన్షన్




ఐరాల(కాణిపాకం),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌ను సస్పెండ్ చేసినట్లు సోమవారం ఈవో గురుప్రసాద్ తెలిపారు. తన పదోన్నతి కోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సమర్పించారంటూ సోమశేఖర్ గురుకుల్‌పై లాయర్ రవికుమార్ ఆరునెలల క్రితం దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించి నివేదిక అందించాలని అప్పటి ఈవో వెంకటేశును ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయన ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు తప్పుడు పత్రాలని తేలాయి. అయితే, సోమశేఖర్‌గురుకుల్‌కు అప్పటి ధర్మకర్తల మండలి అండ ఉండడంతో ఈవో ఏం చేయలేకపోయారు. దీనిపై లాయర్ రవికుమార్ కోర్టులో దావా వేశారు.ఈ నేపథ్యంలో ఈవోగా వచ్చిన గురుప్రసాద్ దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు నెల క్రితం ధ్రువీకరణ పత్రాలపై నివేదిక పంపించారు.దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆలయ ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడిగా ఎస్.ఎస్.గణేష్ గురుకుల్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

వరద బాధితుల సహాయార్థం


'అపుస్మా' సాయం

- సీఎంకు రూ.65 లక్షల చెక్ అందజేసిన నాయకులు



తిరుపతి విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) 65 లక్షల రూపాయల విరాళాన్ని అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల నుంచి విరాళాల ద్వారా అపుస్మా ఈ మొత్తాన్ని సమీకరించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్యదర్శి కె.తులసి విష్ణు ప్రసాద్, రాయలసీమ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి తదితరులు సోమవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. అపుస్మా కార్యవర్గాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్ రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రాస్ రూ.50 లక్షల విరాళం



తిరుపతి(ఆటోనగర్)అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. రాస్ ద్వారా చేస్తున్న సామాజిక కార్యక్రమాలను వివరించారు. సీఎం మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడానికి రాస్ చేసిన సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 20 సూత్రాల పథకం మాజీ చైర్మన్ టీ.శేషసాయిబాబు, రాస్ సంయుక్త కార్యదర్శి ఎం.మమత, సూపరింటెండెంట్ వి.నాగరాజు పాల్గొన్నారు.

హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా సత్యవేడువాసి



చంద్ర ధనశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ దంపతులు

సత్యవేడు, అక్టోబరు 28: రాష్ట్ర హైకోర్టులో సోమవారం ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ ముగ్గురిలో ఒకరు సత్యవేడుకు చెందిన ప్రముఖ న్యాయవాది తూటా చంద్ర ధనశేఖర్ అలియాస్ టీసీడీ శేఖర్. ఈయన చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ప్రతిమ సుశీల్‌కుమార్ రెడ్డితో పాటు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై ఆయనకు అభినందనలు తెలిపారు. కాగా, చంద్రధనశేఖర్ 1988లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదయ్యారు. మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ చేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై వాణిజ్య పన్నుల శాఖ తరఫున వాదనలు వినిపిస్తున్నారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, భూసేకరణ చట్టాలకు సంబంధించిన కేసులు వాదించడంలో ఆయన దిట్ట అని పేరు ఉంది. ఈయన తండ్రి తూటా చంద్రశేఖరన్ పట్టణంలో ప్రముఖ న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

ఎస్వీయూకు ఎన్‌ఆర్‌ఐ రూ.10 లక్షల విరాళం

తల్లిదండ్రుల పేర సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని లక్ష్మణరావు వితరణ



లక్ష్మణరావు నుంచి విరాళాన్ని స్వీకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూకు ఎన్‌ఆర్‌ఐ జేవీ లక్ష్మణరావు రూ.10 లక్షలు విరాళాన్ని అందించారు. యూనివర్సిటీ దూరవిద్యా విభాగం పరిధిలోని సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని కోరారు. ఈ మొత్తానికి సంబంధించి చెక్కును వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఆయన అందజేశారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు ప్రస్తుతం చికాగోలో ఉంటున్నారు. యూనివర్సిటీ డీడీఈ సైకాలజీ పీజీ కోర్సు చదువుకున్నారు. గతంలో ఇండియా ట్రిబ్యూన్ పత్రిక ఎడిటర్‌గా పని చేశారు. ఈ క్రమంలో తన తల్లిదండ్రుల పేర యూనివర్సిటీ డీడీఈ సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని దాత లక్ష్మణరావు కోరారు. ఈయన్ను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి, ఇంజినీర్ తాండవకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా, 87 ఏళ్ల వయసులో లక్ష్మణరావు యూనివర్సిటీ డీడీఈలో సైకాలజీ పీజీ చదవడం గమనార్హం.

గంజాయి కేసులో బీసీఏ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న బీసీఏ విద్యార్థిని సోమవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. తాటితోపు రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లారన్నారు. పోలీసులను చూసి ఇద్దరు పరారవడానికి ప్రయత్నించగా.. బీసీఏ విద్యార్థిని పట్టుకున్నట్లు చెప్పారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు మధుసూదన్‌రావు

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో ఉత్పన్నమైన భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తహసీల్దారు మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని సిద్ధిగుంటలో సోమవారం భూ సమస్యలను పరిష్కరించడానికి గ్రామసభ నిర్వహించారు. రీసర్వే పక్కాగా నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా కేటాయించిన ఎల్‌పీఎం నెంబర్ల ప్రకారం సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. డీఐ రాఘవయ్య, మండల సర్వేయర్ హరిబాబు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పాలసీ కమీషన్‌పై జీఎస్టీ రద్దు చేయాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జీవితబీమా పాలసీ కమీషన్‌పై జీఎస్టీని రద్దు చేయాలని ఏజెంట్ల సంఘ నెల్లూరు డివిజన్ జనరల్ సెక్రటరీ సతీష్‌బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పాలసీలపై పాలసీదారులకు ఇచ్చే బోనస్‌ను పెంచాలన్నారు. ఏజెంట్ల కమీషన్ల చెల్లింపులో పాతపద్ధతి కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, బాబురావు, ఈశ్వర్, శ్రీమన్నారాయణ, పలువురు ఏజెంట్లుపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు

సూళ్లూరుపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరు వద్దనున్న 220 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో మార్పులు చేశామని ఈఈ శ్రీనివాసులు తెలిపారు. 220/132 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ ఫిల్టరేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి నవంబరు 2వ తేదీ వరకు వ్యవసాయానికి రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామ న్నారు.

టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. సోమవారం ఆమె డివిజన్ స్థాయి పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, మెడికల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. టపాసుల విక్రయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. లైసెన్సు పొందిన వారు మాత్రమే టపాసుల విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. బాణసంచా దుకాణాల వద్ద నీరు, ఇసుక, అగ్నిమాపక సామగ్రి అందుబాటు ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రవికుమార్, తహసీల్దార్ నరసింహరావు, సీఐ మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

దొరవారిసత్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తుంగమడుగు వద్ద కాళంగి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకొన్నారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత దయాకర్‌రెడ్డి, కొంత మంది గ్రామస్తులతో కలసి ట్రాక్టర్లను అడ్డుకొన్నారు.

కూలనుందా... కూల్చేస్తారా?

- ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పడగొట్టేందుకు సన్నాహాలు
- నేటి కౌన్సిల్ భేటీలో నిర్ణయం

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ దాహార్తి తీర్చేందుకు 2007లో రూ.11 కోట్లతో కోటపోలూరు చెరువులో సమ్మర్ స్టోరేజీ నిర్మించారు. అక్కడి నుంచి నీటిని పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకులకు నింపి ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకొన్నారు. ఇందులో భాగంగా 2008లో మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. అయితే ఈ ట్యాంక్‌ను రెండేళ్ల నుంచి వినియోగించడంలేదు. ఆయా బోర్ల నుంచి నేరుగా కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితం ట్యాంకును కూల్చివేయాలని మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. మంగళవారం జరగబోయే కౌన్సిల్ సమావేశ అజెండాలో సైతం ఈ అంశాన్ని చేర్చారు. ఇందుకోసం రూ.2.80లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.



సాయినగర్‌లోని ఓవర్ హెడ్ ట్యాంకు

ఎటువంటి తనిఖీలు లేకుండానే..

ఏదైనా ప్రభుత్వ భవనం శిథిలావస్థకు చేరినప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారుల బృందం దానిని తనిఖీ చేయాలి. దానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సైతం ఆమోదం తెలిపారు. భవనం ప్రమాదకరమని నిర్ధారించి మున్సిపల్ అధికారులకు నివేదిక అందజేసిన తరువాత తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సాయినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ విషయంలో మాత్రం అటువంటి తనిఖీలు చేయలేదని తెలిసింది. కేవలం స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఆసరాగా చేసుకొని ఈ ట్యాంకు కూల్చివేతకు మున్సిపల్ అధికారులు సమ్మతించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుత వాటర్ ట్యాంకులో లీకేజీ తప్ప ఎటువంటి పగుళ్లు లేవని, పైగా ఇప్పటికిప్పుడు కూలిపోయే ప్రమాదం కూడా లేదని ఆ ట్యాంకును పరిశీలిస్తే అర్థమవుతుంది. బాగున్న ట్యాంకును హడావిడిగా కూల్చివేయాలని నిర్ణయించడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు ఎన్నో ఉండగా సాయినగర్ ట్యాంకునే పడగొట్టాలన్న నిర్ణయం అనుమానాలకు తావిస్తోంది. ట్యాంకు ఉన్న స్థలం అత్యంత విలువైనది కావడం, పక్కనే ప్రైవేట్ లే అవుట్‌లు ఉండడంతో ఆ స్థలాన్ని సొంతం చేసుకొనే ఆలోచనతో ఈ తతంగం జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా సాయినగర్ వాటర్ ట్యాంకు కూల్చివేయాలని కొందరూ అర్జీల ద్వారా వినతులు ఇచ్చారని, దీంతో ఈ అంశాన్ని కౌన్సిల్ సమావేశం అజెండాలో చేర్చామని తెలిపారు. పాలకవర్గం సభ్యుల నిర్ణయం మేరకు నిర్ణయం తీసుకొంటామని చెప్పారు.

దళితులకు పట్టాలివ్వండి: సీపీఎం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం రెవెన్యూ సర్వే నెం.81లో 82 ఎకరాల ప్రభుత్వ భూమిని దళితులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం దళితులతో కలసి తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల పరంగా 81 సర్వే నెంబరు ప్రభుత్వ భూమిగా ఉందన్నారు. కొందరు భూస్వాములు రికార్డులను తారుమారు చేసి భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. రికార్డుల పరంగా ఉన్న భూములను దళితులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నలుగూరు రమణయ్య, బాలగురవయ్య, తిరుపాలు, గురవయ్య, జేకే రమణయ్య, దయాకర్, శంకరమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం సరికాదు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

డక్కిలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులను కొంతమంది బ్లాక్‌మెయిల్ చేస్తూ వారి విధులకు ఆటంకం కలిగించడం సరికాదని మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులు పులి జనార్దనరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ కొంతమంది ప్రజా తమ సంఘాలకు చెందిన నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మీడియా సమావేశాలు పెట్టి ఎప్పటి విషయాలనో కొత్తగా జరిగినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి పాలన పారదర్శకంగా ఉందని, గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో జరిగిన అవకతవకలపై విచారించి రైతులకు న్యాయం చేయలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని వివరించారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు తెలియజేశారు. ఐదు సచివాలయాల్లో సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు కొందరు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. నిజాయితీపరులైన అధికారులకు అండగా నిలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముద్దా మునిస్వామిరెడ్డి, పోకూరు రమేష్, మునిరత్నం, మునికృష్ణయ్య, శివప్రసాద్, తిరుపతి పెంచలయ్య, దండోలు పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ పునర్నియామకంపై విచారణ



సీసీని విచారిస్తున్న విచారణాధికారి రాజాప్రతాప్

బాలాయపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి వెలుగు క్లస్టర్‌లో గతంలో అవినీతికి పాల్పడి నిధుల దుర్వినియోగం చేసిన సీసీ పునర్నియామకంపై రాష్ట్ర ఉన్నతి డైరెక్టర్ సీహెచ్ రాజాప్రతాప్ సోమవారం విచారణ చేపట్టారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఇన్‌చార్జి ఏపీఎం, సీసీలు, వీవోఏలు, మండల సమాఖ్య సభ్యులను విచారించారు. గతంలో బాలాయపల్లి క్లస్టర్‌లో పనిచేసిన సీసీ రూ.28 లక్షలు నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. విచారణ ప్రక్రియ పూర్తి కాకుండానే తిరిగి ఇదే ప్రాంతంలో సీసీ విధుల్లో చేరడంతో సామాజిక కార్యకర్త చెన్నూరు మస్తాన్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విచారణాధికారి రాజా ప్రతాప్ మీడియాతో మాట్లాడుతూ నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమికంగా వివరాలు లభించాయన్నారు. విచారణ పూర్తి చేసి సమగ్ర నివేదికను సెర్ప్ సీఈవోకు అందజేస్తామన్నారు.

పంగూరులో జిల్లాస్థాయి ఖోఖో జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు - విద్యార్థులకు క్రీడాదుస్తుల వితరణ

ఏర్పేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలం పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి అండర్-14 బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపికలు జరిగాయి. ఒక్కో జట్టుకు 15మంది చొప్పున ఎంపిక చేశారు. నవంబరు 7న పల్నాడు జిల్లా కారంపూడిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారు. హెచ్ఎం విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు లోకేశ్వర్ ఎంపికలను పర్యవేక్షించారు. కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లినేని జగన్నాథం నాయుడు విద్యార్థులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు.

కోట ప్రభుత్వాస్పత్రిని 50 పడకల స్థాయికి పెంచుతాం: బీజేపీ



వార్డులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట ప్రభుత్వాస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతామని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కోమారి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం బీజేపీ నాయకులు ఆస్పత్రిని సందర్శించి పలు వార్డులు, ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కోట ప్రభుత్వాస్పత్రి కోట, వాకాడు, చిట్టమూరు మండలాలతో పాటు చిల్లకూరు మండలంలోని కొన్ని గ్రామాల రోగులకు సేవలు అందిస్తోందన్నారు. ప్రధానంగా సముద్రతీర ప్రాంత మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మత్స్యకారులు ఇక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. అయితే ఆస్పత్రిలో సౌకర్యాల కొరత ఉందని, ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

కోస్టల్ లేబరేటరీ పరిశ్రమలో చోరీ

రూ.5.74 లక్షల నగదు అపహరణ

తడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ లేబరేటరీ పరిశ్రమ కార్యాలయ గది లాకర్‌లో ఉన్న నగదు చోరీకి గురైంది. మండల పరిధిలోని అక్కంపేట వద్ద ఉన్న కోస్టల్ లేబరేటరీ పరిశ్రమ ఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల నగదును మేనేజర్ షేక్ కాలేషా శుక్రవారం బ్యాంక్ నుంచి డ్రా చేసుకొచ్చారు. శనివారం పరిశ్రమ క్యాషియర్‌కు రూ.లక్ష ఇచ్చి, మిగిలిన రూ.5 లక్షల నగదును తన ఆఫీసు టేబుల్ డ్రాయర్ పెట్టి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆఫీసుకు రాగా, టేబుల్ డ్రాలో ఉండాల్సిన రూ.5 లక్షలు, క్యాషియర్ వద్ద ఉండాల్సిన రూ.74వేల నగదు చోరీకి గురైనట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వంతో బీమా సౌకర్యం

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం లభిస్తుందని సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, పాదర్తి కోటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పుచ్చలపల్లి, దొరువుకట్ట, దైవాలదిబ్బ గ్రామాల్లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ సభ్యత్వం వల్ల కలిగే ఉపయోగాలను ఇంటింటా వివరించారు. మొదటగా సీనియర్ టీడీపీ నేత చిల్లకూరు దశరధరామిరెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శశి, ఆదిశేషయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ఏడీఏ నాగర్జున సాగర్, గోవిందరాజులు సోమవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలను చిన్నపిల్లలు, బాలికలు, మహిళలకు అందించటం ద్వారా పోషకాహార సమస్యలను నివారించవచ్చున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ వాటిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీలకు కూరగాయల విత్తనాలు అందించారు. కార్యక్రమంలో విజయశ్రీ, తిరుపాల్, నాగార్జున రెడ్డి, రాజీవన తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వం



పిచ్చాటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5లక్షల బీమాతో ఆర్థిక భరోసా అందిస్తున్న పార్టీ తెలుగుదేశమని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవులు నాయుడు అన్నారు. సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామం గోవర్ధనగిరిలోని స్వగృహంలో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్దురాజు, సర్పంచులు మనోహర్, సతీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

వెంకటగిరిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసులు అమర వీరుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం 9వ బెటాలియన్‌లో తిరుపతిలోని రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్ మాట్లాడుతూ పోలీసులు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

మహిళా క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి



ఎంపీ కేశినేని చిన్నితో క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడూరులో మహిళా క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొణిదల మునిగిరీష్, మాజీ కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి కోరారు. సోమవారం విశాఖపట్నంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి చేపట్టవలసిన పలు అంశాలపై చర్చించారు. గూడూరులో మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

ఏర్పేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం అధ్యాపకులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ మాట్లాడుతూ... తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల బోధన తోడైతే ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధి చెందుతారన్నారు. పిల్లల హాజరును తల్లిదండ్రులకు వివరించారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సులపై అవగాహన



సమావేశంలో ప్రసంగిస్తున్న కరస్పాండెంట్ మిద్దెల హరి

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుగున్నేరి సమీపంలో ఉన్న స్కిమ్స్ కళాశాలలో సోమవారం కొత్తగా చేరిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు... స్కిమ్స్ కళాశాల మిషన్, విజన్, కోడ్ ఆఫ్ కాండక్ట్, ప్లేస్‌మెంట్, కళాశాల అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు అన్ని విభాగాలను సందర్శించారు. ఈ కార్యక్రమలో కరస్పాండెంట్ మిద్దెల హరి, ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రఘురాంరెడ్డి, మోటివేషన్ ట్రైనర్ శ్రీరామ్‌బాబు, హిందుస్థాన్ కోకాకోలా బేవరేజస్ హెచ్‌ఆర్ షైనిక, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మేనకూరు వెల్‌నెస్ సెంటర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

నాయుడుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరులోని వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి హరిత ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరు, గర్భిణులు, రోగుల అందుతున్న వైద్య సేవల ఆరోగ్య స్థితిగతులపై ఆరాతీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యుడు వికాస్, గణాంక అధికారి నాగేంద్రకుమార్, నరేష్‌బాబు, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోసనూరు రాజుపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి పదవీ విరమణ పొందిన కొండూరు బాబు రాజేంద్రప్రసాద్‌ను సోమవారం గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సిద్దులయ్య నాయుడు, సత్యంరాజు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకుడు జోగి శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సాధారణంగా మరణించినా, ప్రమాదవశాత్తు మరణించినా ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. అలాగే కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పుట్టా శంకరయ్య, సురేష్, ప్రసాద్, పెంచలప్రసాద్, మురళి, అంకయ్య పాల్గొన్నారు.

బొక్కిసంపాళెంవాసికి డాక్టరేట్



శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కిసంపాళెం గ్రామానికి చెందిన మునిప్రదీప్‌కు డాక్టరేట్ లభించింది. బొక్కిసంపాళెంకు చెందిన నాగలాపురం వెంకటసుబ్బయ్య, రమాదేవి కుమారుడైన మునిప్రదీప్ ఐఐటీ వారణాసి యూనివర్శిటీలో సివిల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పట్టాను పొందాడు. దీన్ని వర్శిటీ డైరెక్టర్ అమిత్ పత్ర చేతులు మీదుగా అందుకున్నాడు.

మధ్యాహ్న భోజన మెనూ చార్జీలు పెంచాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన మెనూ చార్జీలు పెంచాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి విజయమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో మునిరత్నంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు వాణిమ్మ, మల్లిక, వెంకటేశ్వర్లు, మణి, రజియా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న ప్రకాష్‌నాయుడు

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం విమానాశ్రయానికి చేరుకుని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు ఉపాధ్యక్షుడు టి.ప్రకాష్‌నాయుడు, గోగినేని సురేష్‌నాయుడు స్వాగతం పలికారు. అనంతరం తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

సభ్యత్వ నమోదులో పెళ్లకూరు ప్రథమ స్థానంలో ఉండాలి

పెళ్లకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో పెళ్లకూరు మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుపుదామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం కొత్తూరులోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. సిద్దులయ్యనాయుడు, కేవీ నాయుడు, మురళీ నాయుడు, మల్లిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధీర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

సూళ్లూరుపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దుస్తులు, టపాసులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సభ్యులు అలపాటి అశోక్ కుమార్, సాయిరామ్, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. సోమవారం పట్టణంలోని పార్కువీధికి చెందిన మేడా పిచ్చయ్య (68) మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో పిచ్చయ్య నేత్రాలను చెన్నై శంకర్ నేత్రాలయకు దానం చేశారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ చెకుముకి పోటీల్లో గూడూరు జీవీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం తిరుపతిలోని రిజనల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన సైన్స్ చెకుముకి పోటీల్లో గూడూరు జీవీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు భావన్య, వెంకటేష్, ఉదయ్‌కిరణ్ ప్రథమ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ

కోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడు పంచాయతీ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం అవకతవకలపై బహిరంగ విచారణ జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని స్థానికుడు కిషోర్ డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో వేణు, ఏపీడీ వరప్రసాద్, ఏపీవో పూర్ణిమ, పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామంలో విచారణ జరిపారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

బాలాయపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారంటూ మండలంలోని సిద్దాగుంట గ్రామానికి చెందిన సర్పంచు భర్త రాఘవరెడ్డి సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. గతంలో వెంకటగిరి పట్టణం బంగారు పేటకు చెందిన కొందరు సిద్దాగుంటలో మేత పోరంబోకు భూమిని ఆక్రమించడంతో గ్రామస్తులు అడ్డుకోవడం జరిగిందన్నారు. అదే భూమిని ప్రస్తుతం బంగారు పేటకు చెందిన వ్యక్తులే ఆక్రమిస్తున్నారని, విచారణ జరిపి అడ్డుకోవాలని కోరారు. అలాగే మండలంలోని మన్నూరు గ్రామానికి చెందిన చీకటిపల్లి పోలయ్య తన భూమిని ఆక్రమించారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సందడిగా జిల్లాస్థాయి రగ్బీ పోటీలు



పోటీలకు హాజరైన విద్యార్థినిలు

సత్యవేడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం భారతి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి రగ్బీ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీపతి బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీపతిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారిని మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సత్యవేడులో రగ్బీ జిల్లాస్థాయి పోటీలు జరగడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కాగా ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 300 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పరమశివం, నాయకులు శశి, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముగం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం



రక్తదానం చేస్తున్న డీఎస్పీ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల త్యాగాలను స్మరించుకుందామని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు రక్తదానం చే శారు. విధి నిర్వహణలో మర ణించిన పోలీసుల త్యాగాలను డీఎస్పీ కొనియాడారు.

బుచ్చినాయుడుకండ్రిగ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగ ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని ఎంజీఎం ఆస్పత్రిలో కానిస్టేబుళ్లు రక్తదానం చేశారు. వారిని సీఐ తిమ్మయ్య అభినందించారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పుత్తూరు వార్తలు

జాబ్‌మేళాలో 67 మంది ఔత్సాహికుల ఎంపిక



పుత్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా హిమజ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళా లో 67మంది ఔత్సాహిక అభ్యర్థులు ఎంపిక య్యారని కళాశాల చైర్మన్ సురేంద్రరాజు తెలి పారు. ఇంటర్వ్యూలకు 178 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ లోకనాథం, వైస్‌ప్రిన్సిపాల్ పురుషోత్తం రాజు చెప్పారు. జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి అఫ్రీన్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ రసూల్ పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు



గుంతలమయమైన ఎగువ గూళూరు, వీఎస్ఎస్ పురం రోడ్లు

పుత్తూరు టౌన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తడుకు, శిరుగురాజపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామీణ రోడ్లు గుంతల మయమయ్యాయి. తిరుపతి - చెన్నై జాతీయ రహదారి నుంచి వీఎస్ఎస్ పురం - వేణుగోపాలపురం వెళ్లే రోడ్డు కనీసం నడవడానికి కూడా పనికిరాకుండా పోయింది. ఇదే దారిలో సదా శివ కోన ఆలయం ఉండగా రోడ్డుపై ప్రయాణాలు సాగించలేక పోతున్నామని భక్తులు వాపోతున్నారు. జాతీయ రోడ్డు నుంచి తడుకు, ఎగువ గూళూరు, దిగవ గూళూరు, పొట్టిగుట్ల, శిరుగురాజపాలెంలకు వెళ్లే రింగ్ రోడ్డూ అధ్వానంగా తయారవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా పురాతన భవనం



పుత్తూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల నడుమ ఉన్న పురాతన భవనం ప్రమాద కరంగా మారింది. ఒకే ఆవరణలో ఉన్న తహసీల్దార్, మున్సిపల్ కార్యాల యాలకు ప్రజలు వివిధ పనుల కోసం వస్తుంటారు. పురాతన భవనం వెనుక మున్సిపల్ కార్యాలయ కొత్త భవనం ప్రారంభమైంది. ఈ క్రమంలో కార్యాలయానికి వచ్చి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న పురాతన భవనాన్ని అవసరం మేరకు కొంత భాగాన్ని తొలగించారు. పాత భవనం పైభాగంలో కొయ్యలు ప్రమాదకరంగా వేలాడుతూ ఉండటంతో ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయాందోళనల చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

బైక్ ఢీకొని పెయింటర్ మృతి



సుబ్రమణ్యం రెడ్డి మృతదేహం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీ కొని ఒకరు మృతి చెందారు. పుత్తూరు మున్సిపాలిటీలోని భవానీనగర్‌కు చెందిన ఎం.సుబ్రమణ్యం రెడ్డి పెయింటర్. పనులు ముగించుకుని సాయంత్రం తిరుపతి - చెన్నై జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా కొండల్ చెరువు సమీపంలో తొర్రూరు గ్రామానికి చెందిన మణికంఠ పుత్తూరు నుంచి బైక్‌పై తొర్రూరుకు వెళ్తూ సుబ్రమణ్యం రెడ్డిని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటిని ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఏఎస్ఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలసీపై బోనస్ పెంచాలని ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

పుత్తూరు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ పాలసీపై బోనస్ పెంచాలని, ఏజెంట్లకు జీఎస్టీ రద్దు చేయాలని పుత్తూరు డివిజన్ ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం ఎస్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్ల యూనియన్ కార్యదర్శి రుద్రమోహన్ మాట్లాడుతూ... ఏజెంట్‌కు ఇచ్చే కమీషన్ పేరుతో పాలసీదారులనుచి రుసుం వసూలును రద్దు చేయాలని కోరారు. ఐఆర్‌డీఏ పేరుతో ఏజెంట్లపై ఉక్కుపాదం మోపుతున్నారని ఆరోపించారు. కేఎం సుందరం, సుబ్రమణ్యం, సురేష్, మునిరాజు, పీఆర్‌సీ నాయుడు, దేవరాజులు, శివ, లోక, శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రికి సన్మానం

ఏర్పేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి సన్మానించారు. ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి



మైదానంలో ఏర్పాటైన బాణసంచా దుకాణాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ పరిధిలో 34 తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అనుమతులు ఖరారు చేసినట్లు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో 13, పిచ్చాటూరులో 4, ఏర్పేడులో 6, రేణిగుంటలో 5, నారాయణవనంలో 5, నాగలాపురంలో ఒక దుకాణానికి లైసెన్సులు మంజూరు చేశారు. ఈ మేరకు దుకాణదారులు సోమవారం నుంచి నవంబరు 1వ తేదీ వరకు విక్రయాలు జరుపుకునేలా నిబంధనలు విధించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఉన్న బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం నుంచి విక్రయాలు ప్రారంభించారు.

రూ.3.5లక్షల టపాకాయల స్వాధీనం

అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు సీజ్ చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరులో టపాకాయలను గోదాములో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఇనగలూరుకు చేరుకుని రూ.3.5లక్షల బాణసంచాను సీజ్ చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు

తమిళనాడు నుంచి అక్రమంగా టపాకాయలను శ్రీకాళహస్తిలో దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్టు సమాచారం. కొందరు వ్యాపారులు అనుమతించిన గోదాములో కాకుండా ఇష్టానుసారంగా అనధికారిక గదుల్లో నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో వీటిని ఏర్పాటు చేసినట్లు బహిరంగంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు అశ్రద్ధ వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఆర్డీవో



దుకాణ యజమానులకు సూచనలిస్తున్న ఆర్డీవో

బాణసంచా దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం బాణసంచా విక్రేతలతో సమావేశం నిర్వహించారు. దుకాణాల వద్ద నిబంధనలను కచ్చితంగా పాటించాని, మంటలను అదుపు చేసే పరికరాలు, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతించిన దుకాణాల్లో మాత్రమే విక్రయించడం, నిల్వ చేసుకోవాలన్నారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసుశాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

దోపిడీపై కేసు నమోదు

రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఉద్యోగి సెల్‌ఫోన్, డబ్బు దోచుకున్న ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... విమానాశ్రయం సమీపంలో వాహ్వే పరిశ్రమలో స్టోర్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్న శివకుమార్ శనివారం తమిళనాడు రాష్ట్రం అరక్కోణంలోని తన సొంతూరికి వెళ్లాడు. సోమవారం తెల్లవారు జామున విధులకు హాజరయ్యేందుకు ఉదయం 1గంటకు గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కూడలిలో దిగాడు. అదే సమయంలో అక్కడ ఆటో ఉండగా అందులో ఎక్కాడు. ఐదుగురు ప్రయాణికులతో ఆటో డ్రైవర్ బయలు దేరాడు. రేణిగుంట సమీపంలోని జ్యోతినగర్ రైల్వే క్వార్టర్స్ చివరివీధిలోకి తీసుకెళ్లి శివకుమార్ సెల్‌ఫోన్, డబ్బులు, ఇంటి బీగాలు దోచుకోవడమే కాకుండా ఫోన్‌పే పాస్‌వర్డ్ తెలుసుకుని ఖాతాలో ఉన్న మొత్తం నగదు డ్రా చేశారు. దీంతో శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల తనిఖీ

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ నరసింహమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పురోగతిపై ఆరా తీశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో పనిచేసే పోలీసు సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవ ప్రదంగా మెలగాలని సూచించారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విధులను నిబద్ధతతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించండి

వరదయ్యపాళెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించాలని కూటమి నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 65 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 55 కేంద్రాల్లో సమస్యలు ఉన్నాయన్నారు. స్పందించిన ఎంపీడీవో పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, గురుదేవ్, సూర్యనారాయణ, అజయ్‌కుమార్, కన్నన్, పురుషోత్తం, మురళి, వెంకటయ్య పాల్గొన్నారు.

శ్మశాన సమస్య పరిష్కరించండి

వరదయ్యపాళెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యానాదివెట్టులో శ్మశాన వివాదంలో స్థానికులకు న్యాయం చేయాలని యానాదివెట్టు ఎస్టీకాలనీవాసులు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నియోజకవర్గ కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా గ్రామస్తులు శ్మశానంగా వినియోగించుకుంటున్న భూమిని పట్టా భూములుగా కొనుగోలు చేశారన్నారు. విచారించి నివేదిక ఇవ్వాలని వీఆర్వోను తహసీల్దారు రాజశేఖర్ ఆదేశించారు.

డీకేటీ భూములు పంపిణీ చేయండి

కేవీబీపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు రెవెన్యూలో 167 ఎకరాలను గ్రామంలో నిరుపేదలకు పంపిణీ చేయాలని కర్లపూడి సర్పంచు సుబ్రహ్మణ్యం, ఉపసర్పంచ్ జమున తదితరులు ఇన్‌ఛార్జి తహసీల్దారు మునిరత్నంకు వినతి పత్రాన్ని అందజేశారు. 52 ఎకరాలు పంపిణీ చేస్తే తాము ఊరుకునేది లేదన్నారు. సర్వే చేసి చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

- కేవీబీపురం పట్టణంలోని ఎస్టీకాలనీకి సంబంధించి కాట్రపల్లి సర్వే నెం.212, 213లో 6.10 ఎకరాల్లో ఎన్నో ఏళ్లుగా గిరిజనులు నివాసాలుంటున్నారు. అయితే ఇటీవల ఆ భూముల్లో దారి ఏర్పాటు చేశారు. దీనిపై గిరిజనులు సోమవారం ఇన్‌ఛార్జి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. సర్పంచు బాలాజి, ఫల్గుణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి సమయాల్లో ఇసుక రవాణా ఆపండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం కొందరికి చుట్టంగా మారిందని, రాత్రిపూట ఇసుక తవ్వకాలకు చెక్ పెడితే అక్రమాలకు అరికట్టవచ్చని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక విధానంపై ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ కొరవడటంతో సరిహద్దులు దాటుతోందన్నారు. నిర్దీత సమయంలో ఇసుక రవాణా జరిగేలా చూడాలన్నారు. తహసీల్దారు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి అనుమతి ఉంటేనే ఇసుక తవ్వాలని కోరారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ఏఐటీయూసీ నాయకుడు వైఎస్ మణి, ఐఎఫ్‌టీయూ నాయకుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రికి ఘనస్వాగతం



మంత్రికి ఆహ్వానం పలుకుతున్న ఎస్పీ, జేసీ



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సుధీర్

రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తిరుపతి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న మంత్రికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి కోట వినుత, జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన కూటమి నాయకులతో కలిసి తిరుచానూరు సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌కు బయలుదేరి వెళ్లారు.

గుణయాదవ్ జన్మదిన వేడుకలు



ఏర్పేడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల తెలుగుయువత అధ్యక్షుడు, ఆమందూరు సర్పంచు గుణయాదవ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఆమందూరు, బాలకృష్ణాపురం, ఆమందూరు బీసీకాలనీ, నచ్చనేరి, నాగంపల్లి, దుర్గిపేరిల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. దుర్గిపేరిలో ఆయన కేక్‌ను కట్ చేశారు. ఈ వేడుకల్లో హరిరెడ్డి, కేవీ రమణ, గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై నేడు సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలల విషయంలో ఇటీవల జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, వేధింపులు, సైబర్ నేరాలపై భీమాస్ హోటల్లో మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. కొంతమంది బాలలు చెడు అలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, నివారణలో భాగంగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ నేతృత్వంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

నారాయణవనం, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని నారాయణవనం జడ్పీటీసీ సుమన్ కుమార్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పల్లెపండుగలో భాగంగా రూ.2 కోట్లతో 42 పనులు గుర్తించారని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గుణశేఖర్, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తి వేయాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి



మంత్రితో పిచ్చాటూరు నాయకులు

పిచ్చాటూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో మంత్రిని పిచ్చాటూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సస్పెన్షన్‌లో ఉండడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని వివరించారు. జయచంద్రనాయుడు, పద్దు రాజు,బుజ్జినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలిక మిస్సింగ్‌పై కేసు

కేవీబీపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలిక కేవీబీపురంలోని ఉన్నత పాఠశాలలో చదువుతోంది. శనివారం పాఠశాలకు వెళ్లిన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని ఆదివారం తల్లి మరియమ్మ, తండ్రి గోవిందస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాలించిన పోలీసులు బాలిక ఆచూకీ ల భించకపోవడంతో కేసు నమోదు చేశారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సిమెంటు రోడ్ల నిర్మాణాలు వేగవంతం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఈలు, ఉపాధి, ఇతర శాఖధికారులతో సోమవారం సమీక్షించారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద 28 పంచాయతీల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరైనట్టు చెప్పారు. పల్లె పండగ కార్యక్రమం ద్వారా రోడ్ల నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. అన్ని గ్రామాల్లో నాణ్యంగా పనులు చేపట్టాలన్నారు.